# అనురాగ దేవత నీవు



"సింహం"

"అయితే మీరు వెళ్ళక తప్పదంటారా ?"

బయటకు వెళ్తున్న భర్తని నిలదీసి అడిగింది సుబ్బలక్ష్మి.

"ఏమిటి లక్ష్మీ! నువ్వు మరీ గొడవ చేస్తున్నావు. నేనేం చేసానని ? వారానికోసారి ఆటకి వెళితే తప్పా! పెళ్ళింతరువాత కంపెనీకోసం కొంచెం తాగితే అదేదో మహాపచారమై పోయినట్లు మాట్లాడతావేం ? ఉద్యోగం చేసే మగవాడు ఆపాటి నలుగురిలోను తిరిగి ఫ్రీగా మూవవకపోతే నలుగురూ ఏమనుకుంటారు ?" అన్నాడు చిరంజీవి భార్యని చిరాగ్గా చూస్తూ.

ఉద్యోగం చేసే మగవాడిననే అతని అహంకారం కోపం తెప్పించింది సుబ్బలక్ష్మికి.

"మీరొక్కరేనేంటండి ఉద్యోగం చేసే మగవాళ్ళు. ఈ లోకంలో ఎంతమంది లేరు ? మన పక్కింటి పరంధామయ్య బాబాయిగారు ఉద్యోగం చెయ్యడంలేదా! ఆయనెప్పుడైనా పేకాడ్డం చూసారా ? అంతెందుకు ఎదురింటి జగన్నాధంగారు మీకంటె పెద్ద ఉద్యోగంలో వున్నారు. అయినా ఆయనెప్పుడైనా తాగి ఇంటికి రావడం చూసారా ? కంపెనీకోసమని ప్రారంభమైన మీ అలవాట్లు రోజు రోజుకీ శృతిమించుతున్నాయి. ఈమధ్య అప్పులు కూడా చేస్తున్నారు. ఇప్పుడు అప్పు చెయ్యవలసినంత అవుసరం మనకేమిటుంది ? ఇదంతా మీ వ్యసనాలనుంచే కదూ !"

ఎదురింటి మగాడితో తనని కంపేర్ చేసినందుకు ఛర్రున కోపం వచ్చింది చిరంజీవికి.

"నోర్ముయ్. నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను. నువ్వెవర్తివి అడగడానికి ?"

తలుపు ధడాల్న మూసి విసురుగా బయటికి వెళ్ళిపోయాడు చిరంజీవి.

అప్రతిభురాలయింది సుబ్బలక్ష్మి.

పెళ్ళయాక, ఈ పన్నెండు సంవత్సరాల కాలంలోను ఒక్కసారి కూడా చిరంజీవి సుబ్బలక్ష్మిని అంతలాగ తూలనాడలేదు.

ఒక్కసారిగా దుఃఖం ఉబికి వచ్చింది సుబ్బలక్ష్మికి.

*　　*　　*

సుబ్బలక్ష్మి తండ్రి ముకుందరావుగారికి సుబ్బలక్ష్మి చిరంజీవిని పెళ్ళాడ్డం ఇష్టంలేదు.

అందుకు కారణం చిరంజీవి తండ్రి బాగా వ్యసనపరుడవడమే. తండ్రి వ్యసనాలు కొడుకుకి ఏపాటైనా అంటూకోకుండా వుండి వుంటాయా అనేది ముకుందరావుగారికో అనుమానం.

నిజానికి చిరంజీవి తండ్రెంతటి వ్యసనపరుడో చిరంజీవి అంతటి బుద్ధిమంతుడు. అందుకే పరస్పైన బంధువు చిరంజీవిమీద మనసు పడింది సుబ్బలక్ష్మి.

అభ్యంతరం పెట్టేరు ముకుందరావుగారు.

సుబ్బలక్ష్మి నాల్రోజులు ఇంట్లో సత్యాగ్రహం చేసేసరికి దిగొచ్చారాయన. "తండ్రంటే వ్యసనపరుడుగాని కొడుకు కాదు గదా !" అని సమాధానపడ్డారు. మనసు మాత్రం "ఏమో !" అంటూనే వుంది.

పెళ్ళయి, ఉద్యోగం వచ్చి, స్వంత సంపాదన, వేరే సంసారం ఏర్పడ్డాక కూడా చాలా జాగ్రత్తగా వుండి సుబ్బలక్ష్మిని చాలా అపురూపంగా చూసుకునేవాడు చిరంజీవి. తండ్రి దుష్ప్రభావాలేవీ కొడుకు మీద పడకపోవడంతో అనుమానాలన్నీ పూర్తిగా

తొంగిపోయి సంతృప్తి చెందిన ముకుందరావుగారు అల్లుడికి ఒక ఇల్లు కూడా కొనిచ్చేరు.

సుబ్బలక్ష్మీ, చిరంజీవి ఈ మధ్య ఓ సంవత్సరం క్రితం వరకూ చాలా అన్యోన్యంగానే వుండేవారు. అయితే ఓ సంవత్సరమై వాళ్ళ సంసారంలో శని చిరంజీవి స్నేహితుల రూపంలో ప్రవేశించింది.

చిరంజీవి ఆఫీసుకి ట్రాన్స్‌ఫరై వచ్చారు చిదంబరం, సదానందం. వాళ్ళిద్దరూ చిరంజీవి ఆఫీసుకి ట్రాన్స్‌ఫరై రావడం వలన పెద్ద ప్రమాద మేమీ లేదు. అయితే, వచ్చిన ప్రమాదమల్లా వాళ్ళిద్దరూ చదువుకునే రోజుల్లో చిరంజీవి క్లాసు మేట్సు, బెంచిమేట్సు, రూమ్మేట్సూ అవడం.

రాత్రి పడకమీద తమకంతో చిరంజీవిని ముద్దు పెట్టుకున్న సుబ్బలక్ష్మికి చిరంజీవి పెదవులు సిగరెట్టు వాసన వెయ్యడం ముందు ఆశ్చర్యాన్ని తరువాత కాస్త వికారాన్ని కలిగించింది.

దానికి చిరంజీవి చెప్పిన సంజాయిషీ ఏవంత నమ్మదగినదిగా లేకపోయినా, అన్ని ఆలోచించే సమయం కాదది.

క్రమంగా చిరంజీవి రాత్రుళ్ళు ఇంటికి రావడం ఆలస్యం కాజొచ్చింది. అప్పుడప్పుడు రాత్రిపూట కొంచెం తూలుతూ ఇంటికి వచ్చేవాడు. అప్పుడతని దగ్గరొచ్చే వాసన వెగటు కలిగించేది సుబ్బలక్ష్మికి. మొదట్లో అదేమిటో తెలీకపోయినా లోకజ్ఞానం బాగావున్న సుబ్బలక్ష్మికి అదేమిటో తొందర్లోనే అర్థమయిపోయింది. అంతేగాదు తన భర్త పతనావస్థలో వున్నాడన్న సంగతి కూడా అర్థమయిపోయింది. ఒక్కొక్కప్పుడు నాలుగేసి రోజులు ఇంటికి వచ్చేవాడు కాదు చిరంజీవి. అతని కోసం ఆఫీసుకి పంపిన కేరేజి కూడా తిరిగొచ్చేసేది.

ఆ నాలుగేసి రోజులు చిరంజీవి స్నేహితులతో పేకాటలో కూర్చునేవాడు.

బాల్య స్నేహం కన్న, చదువుకునేటప్పటి స్నేహం కన్న, పేకాట స్నేహం బృహత్తరమైనది - మందు స్నేహం మహత్తరమైనది.

ఫలితం ... చిరంజీవి తరుచుగా ఆఫీసు ఎగ్గొడుతూ వుండేవాడు.

# అనురాగ దేవత నీవు

ఆఫీసువాళ్ళు అప్పుడే మూడు వార్నింగులిచ్చేరు. ఇక సస్పెండు చెయ్యడమే తరువాయి.

అంతేగాదు బ్యాంకులో దాచుకున్న డబ్బంతా వాడెయ్యగా మామగారిచ్చిన ఇల్లు కూడా తాకట్టు పెట్టేసాడు చిరంజీవి.

దాంతో సుబ్బలక్ష్మికి గుండె ఆగినంత పనయింది. ఒక పక్క భర్త పతనమయిపోతున్నాడు. రెండో ప్రక్క తమ భవిష్యత్తు రోజు రోజుకీ అంధకారమయిపోతోంది.

భర్తకి చాలా విధాలుగా చెప్పి చూసింది, బతిమాలుకుంది, బెదిరించింది, చివరికి ఇంట్లో సత్యాగ్రహం కూడా చేసింది. ఎన్ని చేసినా చిరంజీవి మారలేదు. తన అలవాట్లు మానలేదు. అంతేగాదు, రోజు రోజుకీ సుబ్బలక్ష్మంటే నిర్లక్ష్యం ఎక్కువై పోతోంది. ఆ నిర్లక్ష్యం చూస్తూవుంటే ఎందులోనైనా పడి చావాలనిపిస్తోంది సుబ్బలక్ష్మికి. అయినా సుబ్బలక్ష్మి కార్యవాది. ఓపిగ్గా భర్తని మంచి మార్గంలో పెట్టాలని ప్రయత్నిస్తోంది.

ఆ మధ్యనోసారి అత్తగారొస్తే ఆవిడకి పరిస్థితంతా వివరించింది. ఆవిడ కూడా కొడుకు సంగతి కళ్ళారా చూసింది. అయినా దాని కావిడేమీ బాధపడినట్టు కనిపించలేదు. పైగా మగవాళ్ళన్న తరువాత ఆపాటి అలవాట్లేవో వుంటూనే వుంటాయి; వాటిని మనమేవంతగా పట్టించుకో కూడదు అంటూ కోడలికి బోధచేసింది ఆవిడ అనుభవమది మరి.

ఆవిడతో చెప్పి లాభంలేదని పరిస్థితంతా వివరిస్తూ తండ్రికి ఉత్తరం రాసింది సుబ్బలక్ష్మి. ఆయనిప్పుడు రిటైరయి ఇంట్లోనే వుంటున్నారు. ఇక్కడికొచ్చి అల్లుడికి కాస్త బుద్ధి చెప్పమని రాసిందా ఉత్తరంలో. అప్పటికయినా కాస్త సిగ్గొచ్చి మానేస్తాడేమోనని సుబ్బలక్ష్మి ఆశ.

"అమ్మా! ఆకలేస్తోందే. తింటానికేమైనా పెట్టవూ!"

పదేళ్ళ శీను చెయ్యి పట్టుకులాగేసరికి ఈ లోకంలోకి వచ్చింది సుబ్బలక్ష్మి.

* * *

సుబ్బలక్ష్మి ఉత్తరం అందుకున్న ముకుందరావు గారు కంగారుగా పరుగెత్తుకొచ్చారు. అయితే ఇంటి వాతావరణంలో పెద్ద మార్పేమీ లేకపోయినా కూతురు మొహంలోని గాంభీర్యం మాత్రం ఆయనకి చాలా విషయాలు చెప్పక చెప్పింది. మిగిలిన విషయాలు కూతురు చెప్పింది.

అన్నీ చెప్పాక ...

"ఇదీ నాన్నగారు విషయం! మీరెలాగైనా ఆయన్ని సరియైన మార్గంలో పెట్టాలి."

అంతవరకూ వున్న నిగ్రహం సడలిపోయింది. తండ్రి గుండెల్లో దూరి బావురుమంది సుబ్బలక్ష్మి. ఆత్మీయుల్ని చూడగానే కష్టాల్లో వున్నవారికి దుఃఖం అలా పెల్లుబికి వస్తుంది కాబోలు!

ముకుందరావుగారు కూతురి ఆవేదనను అర్థం చేసుకున్నారు.

"బాధపడకమ్మా! చిరంజీవి మంచివాడే. చెబితే తప్పకుండా వింటాడు. నువ్వేం తొందర పడకు నేను చక్కజేస్తాను."

కూతుర్ని ఊరడించారాయన.

* * *

ఆవేళ ఆదివారం ...

మావగారున్నారు గదా అని చిరంజీవి ఇంట్లోనే వున్నాడు.

"ఏ దేవుడు కరుణించేడో!" అనుకుంది సుబ్బలక్ష్మి. తండ్రికి భర్తకి ఏకాంతం కల్పించా లనుకుంది. తన ఎదురుగా తండ్రి భర్తని చీవాట్లేస్తే తను వినలేదు. అంతేగాదు, ఆయనకూడా తరువాత తన యెదుట పడడానికి సిగ్గుపడొచ్చు. అందుకే సీతమ్మధారలో ఒక దూరపు బంధువు ఇంట్లో వున్న ఫంక్షనుకి వెళ్ళాలని నిశ్చయించు కుంది. ఆ మాటే భర్తతో చెప్పింది.

"మీ నాన్నగార్ని ఇంట్లో పెట్టి నువ్వెళ్ళిపోతే ఆయన ఏవనుకుంటారు? పైగా ఆయనకి కావలసిన కాఫీ భోజనాలవీ ఎవరు చూస్తారు?" సందేహంగా అడిగాడు చిరంజీవి.

"అవన్నీ ఏర్పాటుచేసే వెడతాను. వంట చేసేసాను. కాఫీ ఫ్లాస్కులో పోసాను .."

వాళ్ళ సంభాషణ పేపర్లోంచి విన్న ముకుంద రావుగారు బైటికొచ్చి —




"నువ్వు వెళ్ళమ్మా? నాగురించేం ఆలోచించకు. అన్నీ నేను చూసుకుంటాను" అన్నారు.

కూతురెందుకు వెళ్ళిపోతోందో ఆయనకి అర్థమయింది.

పది గంటలకి కొడుకుతో బయల్దేరిన సుబ్బలక్ష్మికి బంధువులందర్ని ఒదిలించుకుని ఇంటికి వచ్చేసరికి రాత్రి ఎనిమిదయింది. సుబ్బలక్ష్మికి కావలసిందికూడా అదే.

"నాన్నగారు ఈసరికి ఆయనకి తల వాచేటట్లు చీవాట్లు పెట్టేవుంటారు. ఈ దెబ్బతోనైనా ఆయన బాగుపడితే అంతేచాలు" — అనుకుంటూ ఇంటి గుమ్మంలోకి అడుగుపెట్టిన సుబ్బలక్ష్మికి సావిడి తలుపులు ఓరగా తీసుండడం కనిపించింది. ఆశ్చర్యంగా ఇంట్లోకి అడుగు పెట్టగానే తమ పడగ్గదిలోంచి తన భర్త పెద్దగా నవ్వడం వినిపించింది. రెట్టింపు ఆశ్చర్యంతో ఆ గదిలో అడుగు పెట్టిన సుబ్బలక్ష్మి నిర్విణ్ణురాలయింది.

లోపల మంచంమీద తండ్రి, భర్త కూర్చుని పేకాడుకుంటున్నారు. గదంతా సిగరెట్టు పొగ అలుముకొనివుంది.

"మీరు భలేవారు మావగారూ! ఇప్పుడే నా దగ్గర ఆట నేర్చుకుని అప్పుడే మూడువందలు గెల్చేసేరే!" అంటున్నాడు చిరంజీవి.

ముకుందరావుగారు సీరియస్‌గా ఇద్దరికి ముక్కలు పంచేస్తున్నారు.

బుద్ధి చెప్తాడనుకున్న తండ్రి తనే బుద్ధిహీనుడై అల్లుడ్ని మందలించకపోగా తను కూడా అతనితో కలిసిపోయాడు.

## అనురాగ దేవత నీవు

సుబ్బలక్ష్మి కళ్ళు అగ్నిగోళాలయ్యాయి.

"నాన్నగారూ!" ఒక్క కేక పెట్టింది సుబ్బలక్ష్మి.

ఆ కేక వినీ మంచంమీద కూర్చున్న ఇద్దరూ ఒకేసారి ఉలిక్కిపడ్డారు.

కూతుర్ని చూడగానే ముకుందరావుగారి మొహంలో కత్తివేటుకి నెత్తురు చుక్కలేదు. కూతురు ముందు తలెత్తుకోలేకపోయారాయన.

"అబ్బే...అల్లుడేవీ తోచడం లేదంటేనూ..." నసిగేరు.

"అందుకని, ఆయనకి బుద్ధి చెప్పవలసింది పోయి, మీరుకూడా పేకాట నేర్చుకుంటున్నారా! ఈ వయసులో అమ్మని దుఃఖ పెడదామనుకుంటున్నారా! నా కర్మ ఎలాగూ కాలిపోయింది. దాన్నికూడా ఏడ్పిస్తారెందుకు? మీరిక్కడుండి లాభం లేదు. ఆయన్ని బాగుచెయ్యడం పోయి మీరు కూడా చెడిపోయేలాగున్నారు. రేపే మీరు వెళ్ళిపొండి."

తండ్రి ప్రవర్తన గుండెను గాయం చేసేసరికి అక్కడ నిలబడలేక వంటగదిలోకెళ్ళి కూలబడింది సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మి ఆ నిసురు తనమీద చూపించనందుకు చాలా సంతోషించేడు చిరంజీవి.

తను చేసిన పనికి తనకా శిక్ష చాలదనుకున్నారు ముకుందరావుగారు. అల్లుడు, కూతురు ఎంత బతిమాలినా ఆ రాత్రే బయల్దేరి వెళ్ళిపోయారాయన.

బుద్ధి చెప్తాడనుకున్న తండ్రి అలా ప్రవర్తించేసరికి బాగా కృంగిపోయింది సుబ్బలక్ష్మి.

భర్తని బాగుచేసుకునే మార్గం తోచడంలేదు ఆమెకి.

ఇంతలో దిగాడు బెంగుళూరు నుండి సుబ్బలక్ష్మి అన్న ప్రసాద్.

ప్రసాద్ సుబ్బలక్ష్మికన్న నాలుగేళ్ళు, చిరంజీవి కన్న రెండేళ్ళు పెద్ద. బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు.

ప్రసాద్ రావడం సుబ్బలక్ష్మికి ఏమాత్రం ఇష్టంలేదు. కాని తల్లి ఉత్తరం రాయడంవలన వచ్చేనని చెప్పాడు ప్రసాద్.

ఆ రోజు రాత్రి ప్రసాద్ చిరంజీవికి అన్నివిధాల నచ్చజెప్పడం, చిరంజీవి దానిని సమర్థించుకోవడం విన్న సుబ్బలక్ష్మికి ఎంతమంది చెప్పినా తన భర్త మారుతాడన్న నమ్మకం పోయింది.

ఆ మర్నాడుదయం ప్రసాదు చిరంజీవి కలిసి బైటికెళ్ళేరు. ఎక్కడికి వెళుతున్నారో చెప్పలేదు సుబ్బలక్ష్మికి. సుబ్బలక్ష్మి కూడా అడగలేదు.

ఆ రోజు రాత్రి వాళ్ళిద్దరూ ఇంటికొచ్చేసరికి పదకొండయింది.

తలుపులు తియ్యగానే గుప్పున వాసనకొట్టింది. వాళ్ళ పరిస్థితి అర్థమయిపోయింది సుబ్బలక్ష్మికి.

సుబ్బలక్ష్మిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రసాద్ చొక్కా పట్టుకుని ఎడాపెడా చెంపలు వాయించేసింది.

అంత మైకంలోను చిరంజీవి ప్రసాదుని సుబ్బలక్ష్మి నుండి వేరుచేసాడు.













"పెద్దా చిన్నా తారతమ్యం లేదా ? మీ అన్నయ్య మీద చెయ్యి చేసుకుంటావా ! మొన్నో రోజు ఇలాగే మీ నాన్నగారిని కూడా పట్టుకుని తిట్టేవు నీకీమధ్య బొత్తిగా కంట్రోల్ లేకుండాపోతోంది అతను చేసిన తప్పేమిటి ? రేసుల కెళ్ళాం అక్కడ డబ్బు పోయింది ఎనిమి బాగా అప్‌సెట్ అయిపోయాడు నేనే మూర్ఛక బారుకి లాక్కుపోయాను "

చిరంజీవి మాట బాగా ముద్దయిపోయింది ప్రసాదు అప్పటికే పూర్తిగా అవుటయిపోయాడు

సుబ్బలక్ష్మి రెండు చేతులతో నెత్తి బాదుకుంది

ప్రసాద్ మరునాడే వెళ్ళిపోయాడని వేరే చెప్పక్కరలేదు

* * *

చిరంజీవి తన ధోరణి అలాగే కొనసాగిస్తున్నాడు

అప్పుడప్పుడు చిరంజీవి, అతని మిత్ర బృందం చిరంజీవి ఇంట్లోనే దుకాణం పెడుతున్నారు వాళ్ళ దుకాణంలో పేకాట, మందులాంటి అయిటమ్స్ చాలా వుంటాయి

సుబ్బలక్ష్మి మొదట్లో ప్రతిఘటించినా వాళ్ళు ఖాతరు చెయ్యలేదు సుబ్బలక్ష్మి నిస్సహాయురాలు అయింది

ఒకసారి దుకాణం పెట్టేరంటే మూడు నాలుగు రోజులవుతుంది లేచేసరికి

ఆవేళ కూడా చిరంజీవి, సదానందం, చిదానందం, మరో ఆనందం, మరో వివారం — అంతా అయిదారుగురు కలసి చిరంజీవి గదిలోనే దుకాణం తెరిచారు.

ఇదంతా చూస్తున్న సుబ్బలక్ష్మి ఏమీ చెయ్యలేక ఎదురుగా వున్న వెంకటేశ్వరస్వామి పటానికి ఒక నమస్కారం పెట్టింది నిజంగా దేవుడనేవాడే వుంటే అతనికీ తప్పకుండా అలనాడు మకరిపాల్పైన కరిరాజు జ్ఞాపకం వచ్చి వుండేవాడేమో !

ఈసారి చిరంజీవి ఇంట్లో దుకాణం నాలుగు రోజులు కొనసాగింది చిరంజీవి సుమారు నాలుగు వేలు ఓడిపోయాడు సుబ్బలక్ష్మి మెడలో నెక్లెసు మార్వాడి కొట్టుకి వెళ్ళిపోయింది అందుకు చిరంజీవి ఏమాత్రం విచారించినట్లు కనబడలేదు. ఈసారి ఓడిపోయినా వచ్చే ఆటలో గెలుపు ఖాయం అన్నట్లుగా వుందాతని ముఖం వచ్చిన మిత్ర బృందాన్ని వీధివరకు సాగనంపి తిరిగి తన గదిలోకి వచ్చిన చిరంజీవి ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి స్థాణువైపోయాడు

గదిలో

తన కొడుకు శీను అటు ఇటు చూసి అక్కడ వున్న గ్లాసుల్లో మిగిలిన ద్రవాన్ని నోట్లో పోసుకుంటున్నాడు

ఓ చేతిలో సగం కాలి ఇంకా కాల్తున్న సిగరెట్టు పీకవుంది

అతని దృష్టి చాపమీద చిందరవందరగా పడివున్న చిల్లరమీద వుంది

చిరంజీవి తన స్థితి మరచిపోయాడు

గబగబా వెళ్ళి శీను వీపుమీద ఒక పిడి గుద్దు గుద్దాడు

'అమ్మా !" గావుకేక పెట్టాడు శీను

## ఏం నేస్తం .... !

అన్యాయాల వేదికపై
అక్రమాల నాటకంలో
క్షుభిత నాయక విలాపం
కర్కశ విలన్ల వికటాట్టం
వీబ్రాసి హాసకుని హాస్యం
వంత పాటల సంగీతం

నీలో
'సం'గీతాన్ని — 'సం'క్షోభాన్ని
వెళ్ళగక్కిస్తున్నాయా ?

లేచి వెళిపోబోకు
ఆ నాటకం అలా కొనసాగొద్దు

వెయ్యి గావుకేక
విప్లవ కేకలా
కురిపించు రాళ్ళవర్షం
తెరని దించేవరకు.

క్రా సోమేశ్వరశర్మ

వంటగదిలో వున్న సుబ్బలక్ష్మి ఆ కేక విని అదిరిపడింది హడావుడిగా పరుగెట్టుకుని చిరంజీవి గదిలోకి వచ్చింది

గదిలో చిరంజీవి శీనుని కష్టమొచ్చినట్లు బాదేస్తున్నాడు

"రాస్కెల్! ఎవర్రా నిన్ని గదిలోకి రానిచ్చింది? ఇవన్నీ నిన్నెవరు తియ్యమన్నారు ?"

అంతకుమించి ఏం తిట్టాలో బోధపడలేదు చిరంజీవికి దెబ్బలు మాత్రం కొడుతూనేవున్నాడు

శీను ఆ దెబ్బలు తట్టుకోలేక గోలు గోలుమని ఏడుస్తున్నాడు

సుబ్బలక్ష్మి వచ్చి శీనుని చిరంజీవి చేతుల్లోంచి లాక్కుంది భయపడిపోయిన శీను తల్లిని గట్టిగా కావిలించుకుని ఏడుస్తున్నాడు.

"ఊరుకో నాన్నా! ఊరుకో అమ్మా ! వివేకం లేనివాళ్ళు ఇలాగే ప్రవర్తిస్తారు నువ్వూరుకో."

కొడుకుని సముదాయిస్తూనే చిరంజీవి తిరస్కారంగా చూసింది సుబ్బలక్ష్మి

ఆ చూపుకే కుంచించుకుపోయాడు చిరంజీవి తనంటే సుబ్బలక్ష్మికి ఎంత హీనమైన భావం ఏర్పడిందో ఆ చూపులోనే అర్థమయిందాతనికి

"వాడినెందుకు కొడుతున్నారు ?"

సుబ్బలక్ష్మి ప్రశ్న చాలా వాడిగావుంది

దానికేమని సమాధానం చెప్పగలడతను ?

సమాధానం చెప్పలేడని కూడా సుబ్బలక్ష్మికి తెలుసు

"మీ తండ్రి అడుగుజాడల్లో మీరు నడుస్తూ వుంటే మీ అడుగుజాడల్లో మీ కొడుకు నడవడానికి ప్రయత్నిస్తున్నాడు. అందులో తప్పేముంది ? అయినా పసివాడు వాడిని కొడితే మాత్రం వాడికేం తెలుస్తుంది ? ఇంత వయసొచ్చి మీకే తెలిసిరాలేదు మీరు ముందనుకున్నట్లు వాడినిప్పుడు మీరెలాగూ అయ్యేయస్ చదివించలేరు కనీసం మీ తరువాత పెద్ద ఆటగాడిగానో లేకపోతే పెద్ద దేవదాసుగానో వాడినీ తయారవనివ్వండి "

ఆ మాటల్లో వ్యంగ్యం చిరంజీవి గుండెల్ని తాకింది అతని తల క్రిందికి వాలిపోయింది

తను చేసిన పనేమిటి ? నిజంగా శీనుని దండించే అధికారం తనకుందా ? అందుకవసరమైన నైతి

మైన అర్హత తనకేది ? తనేమిటనుకున్నాడు ? తనకెలాగూ మరి పిల్లలు పుట్టే యోగంలేదని డాక్టర్లు చెప్పేసారు. ఉన్న ఒక్క కొడుకుని బుద్ధిమంతుడిగా తయారుచేసి, బాగా చదివించి గొప్పవాణ్ణి చెయ్యాలనుకున్నాడు. తననుకున్నదేమిటి ? చేస్తున్నదేమిటి ? తను ఇలాగే వుంటే తన కొడుకెలా వుంటాడు ? తను తన తండ్రిని అసహ్యించుకున్నట్లే తన కొడుకు తనని అసహ్యించుకుంటే ... ఓహ్ ... తను భరించగలడా !

చిరంజీవిలో పశ్చాత్తాపం "ఇంతై ... వటుడింతై" అన్నట్లుగా వృద్ధిపొందిపోతోంది.

"సిగ్గులేకపోతేసరి. తను వెధవ పనులుచేస్తు పసివాడిని గొడ్డుని బాదినట్లు బాదేస్తున్నారు. వాడు చిన్నవాడు కాబట్టి వాడ్ని కొట్టేస్తున్నారు. మరి ఇతను చేసే వెధవ పన్లకి ఇతన్ని ఎవరు కొడతారో ... "

వంటగదిలోంచి సుబ్బలక్ష్మి సణుగుడు వినబడుతోంది.

శీను వెక్కిళ్ళు కూడా వినబడుతున్నాయి.

మరక్కడ నిలబడలేకపోయాడు చిరంజీవి.

* * *

మరునాటి నుండి చిరంజీవి దినచర్య మారిపోయింది.

ఉదయం లేవడం, కొడుకుని కూర్చోబెట్టి చదివించడం, పది గంటలకి భోంచేసి ఆఫీసుకి వెళ్ళడం. సాయంత్రం ఆఫీసు నుండి వచ్చాక ఏదో పుస్తకం పట్టుకు కూర్చోవడం, ఆటలు పూర్తి చేసుకుని ఇంటికి తిరిగివచ్చిన కొడుకుని మళ్ళీ కూర్చోబెట్టి చదివించడం, రాత్రి తొమ్మిదయాక భోంచేసి పక్కమీదికి చేరడం.

అతని ప్రవర్తనలో సుబ్బలక్ష్మి దగ్గర తను కోల్పోయిన అభిమానాన్ని తిరిగి పొందాలనే తపన కూడా వుంది.

ఇదంతా సుబ్బలక్ష్మికి ఆనందదాయకంగానే వున్నా ఈ బుద్ధి శాశ్వతంగా నిలబడుతుందా ! అనే అనుమానం కూడా లేకపోలేదు. ఎందుకంటే ఆ అలవాట్లు అటువంటివి. అందుకే ఆ ఆనంద పడడాన్ని వాయిదా వేసుకుంది సుబ్బలక్ష్మి.

ఆ రోజు శనివారం...

'చిరంజీవిలో వచ్చిన పరివర్తన ఎంతవరకు నిజమో తెలిసిపోతుంది ఇవాళ' అనుకుంది సుబ్బలక్ష్మి. మర్నాడు ఆదివారం కాబట్టి తప్పకుండా దుకాణానికి వెడతాడు చిరంజీవి అనుకుంది. అలా వెళ్ళకూడదని వెయ్యి దేముళ్ళకు మొక్కుకుంది.

మధ్యాహ్నం ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన చిరంజీవి సాయంత్రమైనా ఎక్కడికీ కదలలేదు. అంతేగాదు ఆ రాత్రి చిరంజీవి ఇంట్లోనే పడుకున్నాడు.

మర్నాడు ఆదివారం —

ఉదయాన్నే చిరంజీవి మిత్ర బృందం ఇంటి మీదికి తయారయారు.

సుబ్బలక్ష్మి గుండె గతుక్కుమంది. ఆమెలో ఇప్పుడిప్పుడే ఊపిరి పోసుకుంటున్న నమ్మకం కాస్త ఊపిరి వదిలేసింది.

అయితే...

"రాలేనురా బ్రదర్... ఏమనుకోకండి .. ఇప్పుడే కాదు మరెప్పుడూ రాలేను... మీరు మరోలా అనుకోకండి... గుడ్‌బై" అంటూ వాళ్ళని పంపించేసి తలుపేసాడు చిరంజీవి.

తలుపుకి అడ్డ గడియ వేస్తున్న భర్తని చూడగానే సుబ్బలక్ష్మిలో అణగారిపోయిన ఆనందం ఒక్కసారి పొంగి ఉప్పెనలా ఆమెని ముంచేసింది.

"తన భర్త నిజంగా మారిపోయాడు" — ఈ భావన సుబ్బలక్ష్మిని నిలవనీయడంలేదు.

ఎదురుగా నిలబడిన చిరంజీవి ఆమె హావభావాలని వింతగా గమనిస్తున్నాడు.

అంత ఆనందంలోను తన కర్తవ్యం గుర్తుకొచ్చింది సుబ్బలక్ష్మికి.

పెరట్లో ఆడుకుంటున్న శీను దగ్గరకు వెళ్ళింది.

"ఒరేయి శీను ! ఆవేళ మీ నాన్నగారికి బుద్ధి చెప్పడంకోసం నిన్నా గ్లాసుల్లో వున్నది కొంచెం తాగి సిగరెట్టు పీకలు చేత్తో పట్టుకోమన్నాను. అంతేగాని చనువిచ్చానుగదా అని మళ్ళీ ఎప్పుడైనా అటువంటి పనులు చేసేవో చర్మం ఒలిచేస్తాను జాగ్రత్త !"

తర్జని చూపించి బెదిరించింది వాడిని.

సుబ్బలక్ష్మి చెప్పింది వాడికి సరిగా అర్థం గాకపోయినా "చెయ్యను" అన్నట్లుగా అడ్డంగా తలూపుతూ తల్లి కాళ్ళకి చుట్టుకున్నాడు.

సుబ్బలక్ష్మి తృప్తిగా నిశ్వసించింది.

ఇదంతా కిటికీలోంచి చూస్తున్న చిరంజీవి చకితుడయాడు.

అతని కళ్ళకి సుబ్బలక్ష్మి ఒక దేవతలాగ కనబడసాగింది. ★

